వార్తల్లో అవార్డు తీసుకోవటం తప్పకుండా చూపిస్తారు—

ఇప్పుడు తప్పించుకోలేదు—

తను ఏ విధంగా ఉద్యోగం సంపాదించింది. అమ్మానాన్నలకూ తమ్ముడికీ తెలీదు. ఇప్పుడు వార్తల్లో ఆ సంగతి తెలిసిపోతుంది— వారడిగే ప్రశ్నలకు ఏం జవాబు చెప్పాలో ఆమెకర్థం కావటం లేదు.

కరెంట్ ఫ్యూజ్ తీసేస్తే?!

తలవిదిల్చింది— తనింట్లో కాకపోయినా చుట్టు పక్కల వాళ్ళంతా చూస్తారు— చూసి తప్పకుండా అమ్మానాన్నల్తో చెబుతారు— అప్పుడు తనేం చెప్పాలి.

భగవంతుడా ఈ గండం గట్టెక్కించు—

కనిపించని భగవంతుడు ఈ అరగంటలో ఏ విచిత్రమూ చేయడని ఆమెకు తెలుసు—

అసలు విషయం తెలిస్తే అమ్మానాన్నలు ఏ విధంగా రియాక్ట్ అవుతారో తనూహించ గలదు—

ఇంట్లో పెద్ద తుఫాను చెలరేగుతుంది—

తనను ఉద్యోగం మానేయమంటారు— పెళ్ళి చేస్తామంటారు.

ఉద్యోగం మానేస్తే ఇంటి పరిస్థితి ఏ విధంగా ఉంటుందో తెలుసు తనకు. పూట అన్నానికి తడుముకోవాలి.

కానీ దానికైనా సిద్ధపడతారు గానీ తన నాటకం సాగనివ్వరు—

ఆమెకు ఏడుపొస్తోంది..

పాతకాలం గడియారం మీద వేగంగా తిరుగుతున్న సెకండు ముల్లు— తన మీద కసితో కోపంతో మరింత వేగంతో తిరుగుతున్నట్టనిపించిందామెకు—

వరండాలో రెస్ట్‌లెస్‌గా పచార్లు చేయసాగిందామె.

వెన్నెల వరండాలో సగం మేర పరచుకుంది.

హాయిగా వీస్తున్న చల్లగాలి ఆమెకు మండు టెండలో వడగాల్పుల్లా అనిపించింది.

లోపలికి తొంగి చూసింది.

హాల్లో తల్లి తమ్ముడు తండ్రి ముగ్గురూ. టీవి ముందు కూర్చుని సినిమాను ఆసక్తిగా చూస్తున్నారు.

తన మీద తనకే అసహ్యం వేసిందామెకు.

విరాగ్గా మెట్ల మీద కూలబడి— ఆకాశంలోకి చూసింది. సరిగ్గా అప్పుడొచ్చిందామెకు—

ఆ ఆలోచన!!

(ఇంకావుంది)

## కాలం విలువ



సుప్రసిద్ధ మేధావి, రాజనీతిజ్ఞుడు అయిన బెంజిమన్ ఫ్రాంక్లిన్‌కు ఒక పుస్తకాల షాపు ఉండేది. ఒకరోజు ఆయన షాపులోపల కూర్చొని ఏదో పని చేసుకుంటున్నాడు. ఒక గుమస్తా షాపు కౌంటర్లో కూర్చొని వచ్చేవారికి సమాధానాలిస్తున్నాడు. ఒక వ్యక్తి వచ్చి, ఒక పుస్తకాన్ని వెదికి తీసుకుని దాని ఖరీదెంతో తెలుపమన్నాడు.

"ఒక డాలర్" చెప్పాడు గుమస్తా.

"కొంచెం ధర తగ్గించలేవా?" అని అడిగాడు ఆ వ్యక్తి. వీలు కాదన్నాడు గుమస్తా. "అయితే మీ యజమానిని పిలువు. ఆయన్నే అడుగుతాను" అన్నాడావ్యక్తి కోపంగా.

"ఆయన లోపల పనిలో ఉన్నారు. రావటానికి వీలుపడదు" ఈ విధంగా ఇద్దరి మధ్య వాగ్వివాదం సాగుతోంది. ఈ గొడవ విన్న బెంజిమన్ ఫ్రాంక్లిన్ బయటికి వచ్చాడు.

ఆ వ్యక్తి ఆయన్ను చూసి "ఈ పుస్తకం ఖరీదు ఎంతండీ?" అని అడిగాడు.

"ఒకటిన్నర డాలర్!" చెప్పాడు బెంజిమన్.

"అదేమిటి? ఇప్పుడు మీ గుమస్తా ఒక డాలర్ చెప్పాడే?"

"అవును. ఇప్పుడు నేను చేసుకుంటున్న పని ఆపుకుని వచ్చాను. నా కాలం వృథా అయింది. కాలానికి కూడా విలువ ఉంటుంది" అన్నాడు ఫ్రాంక్లిన్ క్లుప్తంగా.

"సరే పోనీండి, ఖచ్చితంగా ఎంతకిస్తారో తెలుపండి" అడిగాడా వ్యక్తి.

"రెండు డాలర్లు"

"ఇప్పుడు మీరే చెప్పారు గదా! ఒకటిన్నర డాలర్ అని!!"

"అవును. మీరిలాగే మాటలు పెంచుకుంటూపోతే పుస్తకం ధర కూడా పెరుగుతూ పోతుంది" అన్నాడు ఫ్రాంక్లిన్ కఠినంగా.

అంతే! ఆ వ్యక్తి మారుమాట్లాడకుండా రెండు డాలర్లిచ్చి పుస్తకం తీసుకొని వెళ్ళాడు. అప్పుడు ఆ వ్యక్తికి తెలిసి వచ్చింది కాలం విలువ.

— ఎన్. మురళీధర్.

